ప్రజాశక్తి
శుక్రవారం 16 మే 2025
5
విజయనగరం



19న స్థానిక సంస్థల ఖాళీలకు ఎన్నిక

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఖాళీగా ఉన్న స్థానిక సంస్థలకు ఈనెల 19న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల పరిశీలకులు, జాయింట్ కలెక్టర్ ఎన్.సేతుమాధవన్ తెలిపారు. బొబ్బిలి మున్సిపాలిటీలో చైర్మన్ పదవికి, కొత్తవలస మండల కోఆప్షన్ మెంబరు, గరివిడి మండలంలోని సారిపల్లిలో ఉప సర్పంచ్ పదవికి ఎన్నిక జరుగుతుందని తెలిపారు. ఈ ఎన్నికల ప్రక్రియలో భద్రతా ఏర్పాట్లు, వీడియోగ్రాఫీకి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రజా ప్రతినిధులు, అన్ని సంబంధిత వర్గాలు సహకరించి ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని కోరారు.

హెచ్‌పిసిఎల్ పైపులైన్‌కు భూ సేకరణ

ప్రజాప్రయోజనం పేరిట భూములు సేకరించేందుకు ఇక హెచ్‌పిసిఎల్ వంతు వచ్చింది. ఇప్పటికే ఐఓసిఎల్ (ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్) పైపులైను వల్ల వందలాది మంది రైతుల భూములు కోల్పోయిన సంగతి తెలిసిందే. తాజాగా హెచ్‌పిసిఎల్ పైపులైన ఏర్పాటు కోసం భూమి సేకరించేందుకు భూమి యజమానులకు ప్రభుత్వం నోటీసులు జారీచేసింది. విజయనగరం, పార్వతీపురం జిల్లాల్లోని రైతులు, ఇతర భూముల యజమానులు కొంతమేర కోల్పోవాల్సి వస్తుంది. దీంతో, ముఖ్యంగా రైతులు ఆందోళన చెందుతున్నారు.



ఇప్పటికే రైతులకు నోటీసులు జారీ చేసిన ప్రభుత్వం

ఆందోళనలో రైతులు

నేడు రైతు సంఘం ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విశాఖ నుంచి ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర రాజధాని రాయ్‌పూర్ వరకు హెచ్‌పిసిఎల్ పైపులైను ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈనేపథ్యంలో ప్రజాప్రయోజనం పేరిట విజయనగరం, పార్వతీపురం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లోల్లో 18 మీటర్ల వెడల్పుతో 165 కిలోమీటర్ల మేర భూమి సేకరించాలని నిర్ణయించారు. ఇందులో సింహభాగం విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలోనే ఉంటుంది. కేవలం పైపులైన్ల కోసమే కాకుండా మధ్య మధ్యలో పంపింగ్, పిగ్గింగ్ స్టేషన్లు, సెక్షన్ల వారీగా వాల్వు స్టేషన్లు కూడా ఏర్పాటు చేయాల్సివుంటుంది. ఒక్కో పింపింగ్ స్టేషన్‌కు ఆరు నుంచి ఎనిమిది ఎకరాల భూమి అవసరం కానున్నట్టుగా తెలుస్తోంది. ఈలెక్కన విజయనగరం, పార్వతీపురం జిల్లాల్లో సుమారు 4వేల ఎకరాల వరకు సేకరించే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే విజయనగరం జిల్లాలో కొత్త వలస, ఎల్.కోట, ఎస్.కోట, గంట్యాడ, బొండపల్లి, గజపతి నగరం, మెంటాడ, దత్తిరాజేరు, బాడంగి, బొబ్బిలి మండలాల్లో సుమారు 45 గ్రామాల రైతులకు ఈ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నోటీసులు జారీచేశారు. ఇందులో సంబంధిత గ్రామంలో సేకరించబోతున్న సర్వే నెంబర్లన్నీ పొందుపర్చారు. నోటీసులు అందిన 21రోజుల్లోపు అభ్యంతరాలు తెలియజేయవచ్చని పేర్కొన్నారు. వాస్తవానికి రెండేళ్ల క్రితమే ఐఓసిఎల్ పైపులైన్ కోసం విజయనగరం జిల్లా వాసులు వేలాది ఎకరాలకు కోల్పోవాల్సి వచ్చింది. ఈ పైపులైను వల్ల కేవలం సాగు భూములు మాత్రమే కాదు రకరకాల చెట్లు, పండ్ల తోటలు కూడా నష్టపోయారు.తాజా పైపులైన్‌తో రైతాంగానికి మరో నష్టం జరుగనుంది. కంపెనీలు పైప్ లైన్లు వేసే దానికి ఇచ్చే పరిహారాలకు అనుసరించే విధానం శాస్త్రీయంగా లేదు. రైతులు కోల్పోతున్న భూమి, చెట్లకు పరిహారం లెక్కించడంలో శాస్త్రీయమైన పద్ధతి అనుసరించలేదు. దీంతో, భూమి యజమానులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. రైతులకు నష్టం లేకుండా, ప్రభుత్వానికి భారం కాకుండా ప్రత్యామ్నాయం ఉందని నిపుణులు చెప్తున్నారు. ఇప్పటికే విశాఖపట్నం నుండి రాయ్‌పూర్ గ్రీన్‌ఫీల్డ్ హైవే పేరిట భారీగా భూములు సేకరించారు. ఈ రహదారికి ఇరువైపులా 10మీటర్ల వరకు ఖాళీ భూమి ఉంటుంది. ఆ భూమి గుండా పైపులైను వేసుకుంటూ వెళ్ళినా రాయపూర్ కు 150 కిలోమీటర్లు దూరం తగ్గే అవకాశం ఉంది. ఆ భూమి ఇప్పటికే సేకరించిన భూమి కావున ఎవరికీ అభ్యంతరం, నష్టం ఉండదు. దీన్ని పరిగణలోకి తీసుకుని, ప్రత్యామ్నాయం ఆలోచించాలని ఎపి రైతు సంఘం నాయకులు కోరుతున్నారు.

ఓవైపు ఎయిర్‌పోర్టు పేరిట సుమారు 2వేల ఎకారాలు, ఇంకోవైపు రైల్వే మూడోలైను, మరోవైపు గ్రీన్ ఫీల్డ్ హైవే, విజయనగరం బైపాస్ రహదారుల పేరిట ఇప్పటికే వేలాది ఎకరాల పంట భూములను రైతులు కోల్పోయారు. ఫలితంగా వ్యవసాయ ఉత్పత్తులు కూడా మేరకు తగ్గిపోయాయి. ఇటువంటి తరుణంలో తాజాగా హెచ్‌పిసిఎల్ పైపులైను మరింత కలవరపాటుకు గురిచేస్తోంది. ఈనేపథ్యంలో ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన తమ వాదన వినిపించేందుకు భూములు నష్టపోనున్న రైతులు సమాయత్తమవుతున్నారు. ఇందులో భాగంగానే ఈనెల 16న కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టనున్నారు.

ఇవీ డిమాండ్లు

- రైతుల భూములు పోకుండా ప్రత్యామ్నాయంగా విశాఖ నుండి రాయపూర్ వెళ్లే గ్రీన్ ఫీల్డ్ రహదారి ఆనుకుని పైప్ లైన్ వేసే ఆలోచ చేయాలి.
- పైప్ లైన్ భూమి వినియోగపు హక్కు కోసం తీసుకొనే ఉపరితల భూమిపై ఇల్లు, తోటలు, బోర్లు, కట్టడాలు, పశువులు, కోళ్ళ షెడ్లు తదితర వేసుకొనే అవకాశం లేనందున మొత్తం భూవిలువ కోల్పోతున్నందున రిజిస్టర్ విలువ పరిగణన లోకి తీసుకొని 4 రెట్లు పెంచి ధర ను నిర్ణయించాలి. అందులోనుంచి 10 శాతం కాకున్నా 30 శాతం పరిహారం లెక్క కట్టి ఇవ్వాలి. లేదా భూమికి ఇచ్చే పరిహారం మార్కెట్ విలువ ప్రకారం సెంటు 30వేలు నుంచి 1లక్ష వరకు ధర వున్నందున పరిగణలోకి తీసుకొని 2013 చట్టప్రకారం ధర నిర్ణయించి అందులో 30 శాతం పరిహారం ఇవ్వాలి.
- పండ్ల తోటలు, చెట్లు జీవిత కాలాన్ని లెక్కించి పరిహారం నిర్ణయించాలి.
- తోటలు వున్నచోట 5 మీటర్లు మించి తీసుకోరాదు.
- పైప్ లైన్ వేసిన తరువాత భూమిని చదును చేసుకోటానికి రైతుకు సెంటుకు రూ. 3వేలు ఇవ్వాలి.
- పైప్ లైన్ వేసిన తరువాత పూడ్చిన మట్టి వల్ల నిస్సారమై పంట పండదు. ఆ భూమిని సారవంతం చేసి పంటకు అనుగుణంగా తయారు చేయటానికి అయ్యే గెత్తము ఖర్చు సగటు సెంటుకు రూ.2వేల చొప్పున ఇవ్వాలి.
- పైప్ లైన్ డామేజ్ జరిగిన రైతును బాధ్యులుగా పరిగణించరాదు.
- బంజరు, పోరంబొకు, అసైన్డ్ భూములు సాగు చేస్తున్న రైతులకు జిరాయితీ రైతులతో సమానంగా పరిహారం ఇవ్వాలి.

సిఎస్‌ఆర్ నిధులతో 40 చెరువుల అభివృద్ధి

కలెక్టర్ బిఆర్ అంబేద్కర్



ప్రజాశక్తి-కంటోన్మెంట్

చంపావతి నదీపరీవాహక ప్రాంతంలో సిఎస్ఆర్ నిధులతో 40 చెరువుల పునరుద్ధరణకు ప్రణాళికను సిద్ధం చేయాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. యాక్సిస్ బ్యాంకు సిఎస్ఆర్ నిధులతో ధాన్ ఫౌండేషన్ ద్వారా ఈ పనులు జరుగుతాయని, ఈ మేరకు జిల్లా యంత్రాంగానికి ప్రతిపాదన వచ్చిందని తెలిపారు. వారం రోజుల్లో ఎంఒయు జరుగుతుందని, వెంటనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ధాన్ ఫౌండేషన్ ప్రతినిధులతో కలెక్టర్ తమ ఛాంబర్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. చంపావతి నది పరీవాహక ప్రాంతంలోని నెల్లిమర్ల, గరివిడి, గుర్ల, మెరకముడిదాం మండలాల్లో 40 చెరువుల పునరుద్ధరణ, అభివృద్ధికి ధాన్ పౌండేషన్ ముందుకు వచ్చిందని తెలిపారు. ఐదేళ్లపాటు అమలు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా సుమారు రూ. 15కోట్లు వరకు ఖర్చు చేసి, చెరువులను అభివృద్ధి చేయనున్నారని తెలిపారు. తొలిదశలో ఈ ఏడాది ఎంపిక చేసిన 40 చెరువుల్లో పూడికను తొలగించి, గట్టును బలోపేతం చేసి మొక్కలు నాటాలని, చెక్‌డ్యామ్‌లను నిర్మించాలని చెప్పారు. ఆయా చెరువుల ఆయుకట్టుదారుల సంఘం ఆధ్వర్యంలోనే ఈ పనులు జరుగుతాయని చెప్పారు. సంస్థ ఎంపిక చేసిన చెరువులను పరిశీలించి, అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు.

ధాన్ ఫౌండేషన్ ప్రతినిధులు అనిల్, లోకేష్, రాంకుమార్ మాట్లాడుతూ, తమ సంస్థ గురించి, చేపట్టబోయే కార్యక్రమాల గురించి వివరించారు. ఎంపిక చేసిన నాలుగు మండలాల పరిధిలో 235 గ్రామాలు ఉండగా, చంపావతి నది పరీవాహక ప్రాంతంలో 168 గ్రామాలు ఉన్నాయని, వీటిలో 40 గ్రామాలను తాము ఎంపిక చేశామని తెలిపారు. సమావేశంలో సిపిఒ పి.బాలాజీ, జెడ్‌పి సిఇఒ బివి సత్యనారాయణ, డ్వామా పిడి శారదాదేవి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ కవిత, పిఆర్ ఎస్ఇ ఎం.శ్రీనివాసరావు, డిపిఒ టి.వెంకటేశ్వరావు, ఇరిగేషన్ ఎస్ఇ స్వర్ణకుమార్, మైనర్ ఇరిగేషన్ ఇఇ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సివిల్ డిఫెన్స్ వాలంటీర్లుగా యువత నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా యువతను మై భారత్ సివిల్ డిఫెన్స్ వాలంటీర్లుగా నమోదు చేసుకోవాలని కోరుతోందని జిల్లా యువజన అధికారి ఎం. ప్రేమ్ భరత్ కుమార్ తెలిపారు. ముఖ్యంగా అత్యవసర పరిస్థితులు, సంక్షోభ సమయాల్లో జాతీయ ప్రయోజనంలో కీలక పాత్రలు పోషించడానికి యువ పౌరులను శక్తివంతం చేయడానికి ఒక సమిష్టి ప్రయత్నంలో భాగంగా ఈ ప్రక్రియ చేపట్టిందని పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు, ప్రజా అత్యవసర పరిస్థితులు, ఇతర ఊహించని పరిస్థితులలో పౌర పరిపాలనను పూర్తి చేయగల సుశిక్షితులైన, ప్రతిస్పందించే స్థితిస్థాపక స్వచ్ఛంద దళాన్ని నిర్మించడం దీని లక్ష్యమని తెలిపారు. సివిల్ డిఫెన్స్ వాలంటీర్లు విస్తత శ్రేణి సేవల ద్వారా స్థానిక అధికారులకు మద్దతు ఇవ్వడం ద్వారా ఈ విషయంలో కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. వీటిలో రెస్క్యూ మరియు తరలింపు కార్యకలాపాలు, ప్రథమ చికిత్స, అత్యవసర సంరక్షణ, ట్రాఫిక్ నిర్వహణ, జనసమూహనియంత్రణ, ప్రజా భద్రత వంటివి ఉంటాయన్నారు. ఈ నేపథ్యంలో యువత పేర్లు https://mybharat.gov.inలో నమోదు చేసుకోవాలని పేర్కొంది. మరిన్ని వివరాలకు 970445130, 843700280 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి వకుల్ జిందాల్

వేగవంతమైన సేవలకు 'ఇ-ఆఫీస్'

ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లా పోలీసు కార్యాలయ పరిపాలనలో పారదర్శకతను, వేగవంతమైన సేవలందించేందుకు 'ఈ-ఆఫీస్' విధానాన్ని మరింత మెరుగ్గా అమలు చేసేందుకు జిల్లా పోలీసు కార్యాలయ ఉద్యోగులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. శిక్షణను ప్రారంభించిన ఎస్‌పి వకుల్ జిందాల్ మాట్లాడుతూ ప్రభుత్వం డిజిటలైజేషను దిశగా అడు గులు వేస్తూ వేగవంతంగా సేవలందించేందుకు ఈ విధానాన్ని ప్రారంభించిందన్నారు. ఈ-ఆఫీసు విధానంతో అధికంగా పేపర్లును వినియోగించకుండా, వేగవంతంగా సేవలందించే వెసులుబాటు ఉంటుందన్నారు. 'ఈ-ఆఫీసు' విధానం వల్ల కార్యాలయ సిబ్బందికి సౌలభ్యంగా ఉండడమే కాకుండా, ఫైళ్ళకు భద్రత పెరుగుతుందన్నారు. ఆఫీసు డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేటిక్ ఆఫీసరు ఆర్.నరేంద్ర మాట్లాడుతూ ప్రారంభంలో కొద్దిగా ఇబ్బంది అనిపించినప్పటికీ, భవిష్యత్తులో ఎంత పనినైనా సులువుగా చేసుకొనే వెసులుబాటు ఉంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి (అడ్మిన్) పి.సౌమ్యలత, ఎఒ పి.శ్రీనివాసరావు, పర్యవేక్షకులు వెంకటలక్ష్మి, రామకృష్ణ, ఎస్‌బి సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్.వి.ఆర్.కె.చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

'ఈ-బీట్స్' తో పోలీసు గస్తీ పటిష్టం

జిల్లాలో నేరాలను నియంత్రించడంలో 'ఈ-బీట్స్' విధానంను అమలు చేసి, పోలీసు గస్తీని మరింత పటిష్టం చేస్తున్నట్లు ఎస్‌పి వకుల్‌జిందాల్ తెలిపారు. గురువారం ఈ-బీట్స్ విధానంపై పోలీసు అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించి, వారి సందేహాలను నివృత్తి చేందుకు జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీసు గస్తీలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ఈ-బీట్స్ విధానంతో పోలీసు గస్తీని మరింత పటిష్టం చేసి, పోలీసు పహారాను సమర్ధవంతంగా అమలు చేస్తామన్నారు. బీటు క్రియేట్ చేసే సమయంలో బీటు సిబ్బంది నిర్వహించాల్సిన విధులు, ఆయా ప్రాంతాల్లో ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన ఎ.టి.ఎం. కేంద్రాలు, బస్టాండులు, రైల్వేస్టేషనులు, బ్యాంకులు, లాక్డ్ హౌస్లు, హిస్టరీ షీట్లు కలిగిన వ్యక్తుల వివరాలు, షాపింగ్ మాల్స్ వంటి వాటి వివరాలు, ఏ ప్రాంతంలో ఎంత సమయం పహారా కాయాలి, గస్తీ తిరగాలన్న విషయాలు నమోదు చేస్తామన్నారు. ప్రతీ రోజూ పోలీసు స్టేషను అవసరాలు, ప్రాధాన్యతలను అనుసరించి, ఈ బీటును మార్పులు చేసుకోవచ్చు నన్నారు. అదనపు ఎస్‌పి (అడ్మిన్) పి.సౌమ్యలత, ఎస్‌బి సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్‌విఆర్‌కె చౌదరి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎజిపిగా సూర్యనారాయణ నియామకం



ప్రజాశక్తి-చీపురుపల్లి

చీపురుపల్లి మేజిస్ట్రేట్ కోర్ట్ అసిస్టెంట్ ప్లీడర్‌గా చీపురుపల్లికి చెందిన మండల సూర్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ప్రభుత్వం నుండి సూర్యనారాయణకు ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా సూర్యనారాయణ స్థానిక విలేకరులతో మాట్లాడారు. తనను ఎజిపిగా నియమించడం పట్ల స్థానిక ఎమ్మెల్యే కిమిడి కలవేంకటరావుకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని చెప్పారు.

బొండపల్లిలో నేడు మంత్రి ప్రజా దర్బార్

ప్రజాశక్తి-విజయనగర

రాష్ట్ర చిన్న మధ్యతరహా పరిశ్రమలు. ఎన్నారై వ్యవహారాలు, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. మంత్రి శుక్రవారం మధ్యాహ్నం నాలుగు గంటలకు బొండపల్లి చేరుకొని రాజుల చావిడి వద్ద ప్రజా దర్బార్ నిర్వహిస్తారు. ప్రజా దర్బార్ లో వినతులు అందజేసేవారు తమ ఫోన్ నెంబర్ చిరునామాతో సహా వివరంగా తమ విజ్ఞప్తులను పేర్కొనాలని మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలు తెలిపింది.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చేస్తున్న తమ ప్రయత్నంలో ప్రజా సహకారం కూడా అవసరమని సంస్థ సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు అన్నారు గురువారం 30వ డివిజన్ ధర్మపురి ప్రాంతంలో పర్యటించారు. స్థానిక సమ స్యలను గుర్తించి వాటి పరిష్కారానికి తగు చొరవ చూపుతామని తెలిపారు. డివిజన్ కార్పొరేటర్ పతివాడ గణపతి రావు, ఎఒ సీతా రామమూర్తి, పాల్గొన్నారు.

డిసిసిబికి రూ.7.66 కోట్ల లాభం

•వాటాదారులకు రూ.1.09 కోట్ల డివిడెండ్ ప్రకటన

•సహకార సంఘాలు, బ్యాంకు సిబ్బందిని అభినందించిన జాయింట్ కలెక్టర్



డిసిసిబి సిఇఒను అభినందిస్తున్న జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్

ప్రజాశక్తి-విజయనగరం

గత ఆర్థిక సంవత్సరంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లాభాల బాట పట్టింది. డిసిసిబి పర్సన్ ఇన్ ఛార్జిగా వ్యవహరిస్తున్న జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ అధ్యక్షతన బ్యాంకు మహాజనసభ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి లావాదేవీల ముగింపునకు సంబంధించిన స్టాట్యూటరీ ఆడిట్ నివేదికను, లాభనష్టాల నివేదికను చర్చించి ఈ సమావేశంలో ఆమోదించినట్టు బ్యాంకు సిఇఒ. సిహెచ్.ఉమామహేశ్వరరావు వెల్లడించారు. గత ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు రూ.7.66 కోట్ల నికరలాభం ఆర్జించినట్లు జాయింట్ కలెక్టర్ వెల్లడిస్తూ బ్యాంకును లాభాల బాటవైపు నడిపించిన సహకార సంఘాల సిబ్బందిని, డిసిసిబి సిబ్బందిని అభినందించారు. గత ఆర్థిక సంవత్సరంలో నెట్ ఎన్‌పిఎ రూ.3.12 కోట్లుగా నమోదయ్యిందని తెలిపారు. లాభాలు ఆర్జించిన దృష్ట్యా బ్యాంకుకు చెందిన ఎ-క్లాస్ వాటాదారులకు లాభాల్లో ఒక శాతం రూ.1.09 కోట్లు డివిడెండ్ గా ప్రకటించారు. మహాజనసభలో బ్యాంకు సిఇఒ ఉమామహేశ్వరరావు, జిల్లా సహకార అధికారి పి.రమేష్, నాబార్డు డిడిఎం టి.నాగార్జున, ఆప్కాబ్ డిజిఎం అఫ్సర్ జహాన్, మహాజన సభ్యులుగా వున్న సహకార శాఖ అధికారులు, సహకార సంఘాల పిఐసిలు పాల్గొన్నారు.

రవాణా రంగ రక్షణకు 20న టైర్‌బంద్

ప్రభుత్వ, ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు యూనియన్ పిలుపు



సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ, ప్రైవేటు ట్రాన్సుపోర్టు యూనియన్ నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రవాణా రంగ రక్షణ కోసం ఈనెల 20న జరుగుతున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ప్రభుత్వ, ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు యూనియన్ పిలుపునిచ్చాయి. గురువారం ఎస్‌డబ్ల్యుఎఫ్ విజయనగరం డిపో కార్యదర్శి ఎ.చంద్రయ్య అధ్యక్షతన గురువారం ఉదయం యుటిఎఫ్ కార్యాలయంలో ప్రభుత్వ ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు యూనియన్ సమావేశం జరిగింది. లారీ అసోసియేషన్ అధ్యక్షులు కిర్లంపూడి సీతారామాంజనేయులు, ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ కో కన్వీనర్ ఎ. జగన్ మోహన్ రావు, ఎపిపిటిడి ఎయిర్ బస్ డ్రైవర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జెఎస్ఎన్ రాజు, ఆటో యూనియన్ అధ్యక్షులు బి.పాపారావు, ఉపాధ్యక్షులు ఎస్.రామనాయుడు మాట్లాడుతూ నూటికి 90 శాతం మంది ఓనర్ కమ్ డ్రైవర్లు గా స్వయం ఉపాధిగా బతుకుతున్న రవాణా రంగాన్ని స్వదేశీ, విదేశీ కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు మోటారు వాహన చట్టంలో అనేక మార్పులు చేశారని, అందులో భాగంగానే ఆర్టీసీలో ఖాళీలను భర్తీ చేయకుండా అద్దె బస్సులు, ఆన్ కాల్ డ్రైవర్లతో ప్రభుత్వమే శ్రమ దోపిడి చేస్తుందని అన్నారు. ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టులో అగ్రిగేటర్స్ పేరుతో ఓబర్, ఓలా, రాపిడో వంటి సంస్థలకు అనుమతులు ఇస్తున్నారని, దీంతో రవాణా రంగా డ్రైవర్లకు తీవ్ర నష్టం జరుగుతుందని అన్నారు. ఫీజులు, పెనాల్టీలు, ఈ చలానాలు ,టోల్ ,గ్రీన్ టాక్సలు, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి మోయలేని భారాలను వేస్తున్నారని మండిపడ్డారు. ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రతా మాసోత్సవాలు చేస్తున్న ప్రభుత్వాలు లైసెన్సులు, రెన్యువల్, ఫిట్నెస్, రిజిస్ట్రేషన్ సేవలను ప్రైవేటు ఏజెన్సీలు ఇవ్వడం అంటే ప్రమాదాలను ప్రోత్సహించడమేనని, డ్రైవర్లపై మరింత భారాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రవాణా రంగాన్ని ఒక పరిశ్రమగా గుర్తించి డ్రైవర్ లందరికీ ఇఎస్ఐ, పిఎఫ్, గ్రాట్యుటీ, పెన్షన్ వంటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం మే 20 న కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు, రవాణా రంగ సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు టైర్ బంద్ పాటించి సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సురేష్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 07:30 గంటల నుండి 10:30 గంటల వరకు విద్యుత్తు కోత విధిస్తామని ఎపిఇపిడిసిఎల్ ఇఇ పి.త్రినాధరావు తెలిపారు. చెట్టు కొమ్మలను తొలగించే క్రమంలో వివేకానంద కాలనీ, పోలయ్యపేట, బొగ్గులు దెబ్బ, ఎల్‌బి కాలనీ, కంటోన్మెంట్ పోస్ట్ ఆఫీస్ ఏరియా, హోటల్ సాలిమర్ ఏరియాలో విద్యుత్ నిలుపుదల చేస్తామని తెలిపారు.

ఉదయం 10:30 గంటల నుండి 13:30 గంటల వరకు విటి అగ్రహారం సబ్ స్టేషన్ పరిధిలోగల అర్అండ్‌బి ఏరియా అలకానంద కాలనీ, కుసుమ గజపతి నగర్, సిబి కాలనీలో విద్యుత్తు నిలుపుదల చేస్తామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెసి సేతమాధవన్

పందుల పెంపకానికి ప్రత్యేక స్థలాలు

జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

మున్సిపల్ ప్రాంతాల్లో పందుల సమస్యను నివారించే చర్యల్లో భాగంగా, వాటికోసం ప్రత్యేక స్థలాలను కేటాయించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ అధికారులను ఆదేశించారు. మున్సిపాల్టీల్లో పందుల సమస్య పరిష్కారంలో భాగంగా, హైకోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్, రెవెన్యూ, వివిధ శాఖల అధికారులు, పందుల పెంపకం దారులతో కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. జెసి మాట్లాడుతూ, విజయనగరం కార్పొరేషన్‌లో సుమారు 1,085, బొబ్బిలిలో 45, రాజాంలో 40, నెల్లిమర్ల మున్సిపాల్టీలో 16 పందులు ఉన్నట్లు అధికారులు నివేదిక ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా మున్సిపల్ పరిధి నుంచి 5 కిలోమీటర్ల లోపల, పందుల పెంపకానికి స్థలాన్ని కేటాయించాల్సి ఉందని చెప్పారు. వీటి ప్రకారం విజయనగరంలో సుమారు 2 ఎకరాలు, బొబ్బిలిలో 0.3 ఎకరాలు, రాజంలో ఎకరా, నెల్లిమర్లలో 0.15 ఎకరాల స్థలాన్ని కేటాయించాలన్నారు. మార్కెట్ ధర లేదా లీజు ప్రాతిపదికన ఈ స్థలాలను పందుల పెంపకం దారులకు కేటాయించనున్నట్లు తెలిపారు. పందుల పెంపకం వల్ల ప్రజారోగ్యానికి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్యశాఖకు జెసి సూచించారు. సమావేశంలో విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య, ఇతర మున్సిపల్ కమిషనర్లు, పశు సంవర్ధకశాఖ జెడి డాక్టర్ వైవి రమణ, డిపిఒ టి.వెంకటేశ్వరావు, ఆర్‌డిఒలు మోహనరావు, ఆశయ్య, మెప్మా పిడి సత్తిరాజు, తాహశీల్దార్లు, ఇతర రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రీజనల్ డైరెక్టర్ నాయుడు

సులభతరంగా ప్రణాళిక రంగ సేవలు

ప్రణాళిక విభాగం రీజనల్ డైరెక్టర్ నాయుడు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రణాళికారంగ సేవలను ప్రజల ముంగిటికే చేర్చి, సులభతరంగా అందించాలని టౌన్ ప్లానింగ్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ నాయుడు సిబ్బందికి సూచించారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలోవిజయనగరం, నెల్లిమర్ల పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది, ప్రణాళికా కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రణాళిక సిబ్బంది, కార్యదర్శులు తమ సేవలను విస్తత పరిచి మంచి ఫలితాలు రాబట్టాలని సూచించారు. ప్రణాళిక విభాగంలో మరింత నూతన ఒరవడిని తీసుకువచ్చేందుకు వివిధ రాష్ట్రాలలో పర్యటించిన బృందం అనేక విషయాలపై అధ్యయనం చేసిందన్నారు. దాని ఫలితంగా మెరుగైన విధానాలను ప్రస్తుతం అమలు చేస్తోందని చెప్పారు. వీటిపై సిబ్బంది, ప్రణాళిక కార్యదర్శులు,లైసెన్స్డ్ టెక్నికల్ పర్సన్స్ మరింత అవగాహన పెంచుకొని ప్రజలకు చేరువ చేయాలని సూచించారు. సమావేశంలో డిటిసిపి నాగలక్ష్మి, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు హరిబాబు, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ వైస్‌చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం

ప్రజాశక్తి - బొబ్బిలి

మున్సిపల్ వైస్ చైర్మన్ జి.రమాదేవిపై అవిశ్వాస తీర్మానం పెట్టారు. అవిశ్వాస తీర్మానం లేఖను గురువారం కలెక్టర్ అంబేద్కర్ కు టిడిపి పట్టణ అధ్యక్షుడు రాంబార్కి శరత్, కౌన్సిలర్లు ఎం.తిరుపతి రావు, కె.రామారావు అందజేశారు. మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణపై అవిశ్వాస తీర్మానం పెట్టిన విషయం తెలిసిందే. వైస్ చైర్మన్-1 రమాదేవిపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదిస్తూ పార్టీలోని కౌన్సిలర్లు కలెక్టర్‌కు అందించారు. వైస్ చైర్మన్-2పై కూడా అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు సిద్ధం అవుతున్నట్టు సమాచారం. అవిశ్వాస తీర్మానంపై 10మంది వైసిపి అసమ్మతి, 10మంది టిడిపి కౌన్సిలర్లు సంతకాలు చేశారు.



అవిశ్వాస తీర్మానాన్ని కలెక్టర్‌కు అందిస్తున్న నాయకులు

నగర పంచాయతీలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. గురువారం కమిషనర్ ఎ. తారక్ నాథ్ పర్యవేక్షణలో ఇందిరా కాలనీ సచివాలయం పరిధిలో ప్రధాన రహదారి కాలువలో పూడికలు తీయడం, మొక్కలను పిపికారి చేయడం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ తారక్ నాథ్ మాట్లాడుతూ పరిశుభ్రత పాటించడం అందరి బాధ్యతని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.ఉమా భాస్కర్, వార్డు శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

డెంకాడ వైద్యాధికారిగా అనూష

ప్రజాశక్తి- డెంకాడ



స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారిగా డాక్టర్ ఎన్.అనూష గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ వైద్యాధికారిగా పనిచేసిన భవానీ ఉద్యోన్నతిపై అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా వెళ్లడంతో ఆమె స్థానంలో ఈమె బాధ్యతలు స్వీకరించారు.

వేపాడలో వర్షం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలో గురువారం మధ్యాహ్నం ఉరుములు మెరుపులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది. వర్షం పడడం వల్ల తొలకరి నువ్వు పంటకు ఉపయోగకరంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. వర్షం కంటే ఉరుములు మెరుపులు వల్ల ప్రజలకు భయాన్ని కలిగించిందని చెబుతున్నారు.

మద్యం దుకాణాల్లో తనిఖీ

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని పలు మద్యం దుకాణాలను జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.శ్రీనాథుడు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని స్టాక్ రికార్డులను పరిశీలించారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు అమ్మరాదని దుకాణ యజమానులకు సూచించారు. మద్యం దుకాణాల ఆవరణలో మద్యం సేవించకూడదని చెప్పారు. బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేయరాదని ఆదేశించారు. సిఐ రవికుమార్, ఎస్‌ఐ చంద్రమోహన్, సిబ్బంది పీవీవి సత్యనారాయణ, ఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



స్టాక్‌ను పరిశీలిస్తున్న అధికారులు



ఇ- శ్రమ్ పోర్టల్‌పై అవగాహన కల్పిస్తున్న కోదండరావు

ఇ- శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోండి

ప్రజాశక్తి - సంతకవిటి

16 నుండి 50 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారు తప్పనిసరిగా ఈ-శ్రమ్ పోర్టల్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని రాజాం సహాయ కార్మిక అధికారి బి. కోదండరావు తెలిపారు. మండలంలోని కావలిలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చరవాణి సంఖ్యతో అనుసంధానం కలిగిన ఆధార్ నెంబర్‌ను ఈ -శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ -శ్రమ్ పోర్టల్‌లో నమోదైన కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు రూ.2లక్షలు, పాక్షిక వైకల్యం సంభవిస్తే రూ.1 లక్ష బీమా పరిహారం అందుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాసరావు, పంచాయతీ సెక్రటరీ సిహెచ్ సురేంద్ర కుమార్, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

సారా రహితంగా రామభద్రపురం

ప్రజాశక్తి - రామభద్రపురం

మండలాన్ని నాటుసారా రహిత మండలంగా ప్రకటిస్తున్నట్లు ఎక్సైజ్ సిఐ చిన్నంనాయుడు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నవోదయం 2.0 కార్యక్రమానికి సంబంధించిన మండల స్థాయి సమావేసాన్ని ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో మండలాన్ని నాటు సారా రహిత, సారా లేని గ్రీన్ మండలంగా డిక్లేర్ చేసి తీర్మానించారు. ఇంతకు ముందే మండలంలోని బి కేటగిరి గ్రామమైన జోగిందిరవలసతో పాటు మిగిలిన 22 పంచాయతీల్లో కూడా నాటు సారా లేదని, నాటు సారా రహిత పంచాయతీలుగా గ్రామపంచాయతీలు తీర్మానాలు చేశాయని చెప్పారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ, డిటి గిరిధర్, ఎస్‌ఐ ప్రసాదరావు, బొబ్బిలి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎక్సైజ్ సిఐ చిన్నంనాయుడు



ఉష్ణతాపంపై అవగాహన కల్పించేందుకు సిద్ధంగా ఉన్న వాహనాలు

ఉష్ణతాపంపై అవగాహన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉష్ణతాపం నుండి ప్రజలకు ఉపశమనం కలిగించే విధంగా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేసినట్లు నగర పాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. ఈ మేరకు గురువారం ఉదయం ప్రచార వాహనాలను ఆయన ప్రారంభించారు. వేసవిలో ఉష్ణతాపం నుండి ఉపశమనం కలిగేందుకు ఏఏ జాగ్రత్తలు వహించాలన్న వివరాలుతో కూడిన బ్యానర్లను ప్రదర్శనకు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వచ్చే శనివారం నాడు బీట్ ద హీట్ పై స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తుందన్నారు. ఇందులో భాగంగా వేసవిని దష్టిలో ఉంచుకొని ప్రజలకు ఉపశమనం కలిగించే చర్యలకు పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇప్పటికే అనేక ప్రధాన జంక్షన్లలో చలివేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛంద్ర కార్యక్రమంలో విరివిగా మొక్కలు నాటే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

సూర్యఘర్‌కు స్పందన కరువు

◆ నియోజవర్గానికి 10 వేలు లక్ష్యం
◆ వచ్చిన దరఖాస్తులు కేవలం1053

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలను లక్ష్యాలను చేరుకోవడం లేదు. ఆయా వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకునేలా రాయితీ లిస్తున్నా వాటివల్ల పెద్దగా ఉపయోగం లేదని లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. అందులో భాగంగా ఇటీవల అమలు చేసిన సూర్యఘర్ పథకానికి స్పందన కరువైంది.

గతేడాది ప్రారంభమైన సూర్యఘర్ పథకం ప్లాంట్లు ఏర్పాటులో ప్రజల నుంచి స్పందన తక్కువగా ఉంది. గత ప్రభుత్వంలో ప్రారంభమైనప్పటికీ కూటమి ప్రభుత్వంలోనూ అదే పరిస్థితి నెలకొంది. ఎస్‌సి, ఎస్‌టిలకు ఉచితంగా మహిళా సంఘాల సభ్యులకు ప్రాధాన్యం, ఇంటి డాబాలు లేకపోయినా ఖాళీ స్థలాల్లో ప్లాంట్ల ఏర్పాటు తదితర అవకాశాలు కల్పించింది. అయినప్పటికీ వీటి ఏర్పాటుకు దరఖాస్తులు తక్కువగా రావడంతో అధికారులు అవాక్కయ్యారు. జిల్లాలో నియోజకర్గానికి పదివేలు చొప్పున ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టగా జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులు కేవలం 1053 అంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోంది.



సూర్యఘర్ పథకం కింద అమర్చిన ప్లాంటు

సూర్యఘర్‌పై అవగాహన పెంచాలి

వినియోగదారులకు అవగాహన కల్పించడంలో సంబంధిత యంత్రాంగం, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలున్నాయి. అన్ని జిల్లాల్లో కమిటీలను ఏర్పాటు చేసి, చైర్మన్లుగా ఎంపిలను నియమించాయి. జిల్లాకు సంబంధించి ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు చైర్మన్‌గా ఉన్నారు. సూర్యఘర్ పథకం ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన ప్రాధాన్యత పెంచితే వాటి సంఖ్య పెరిగే అవకాశం ఉంది. మరో వైపు నియోజకవర్గానికి పది వేల లక్ష్యంగా పెట్టగా, ఎస్సి, ఎస్టీలకు ఉచితంగా ఏర్పాటు చేస్తారు. దీనిపై విధి విధానాలు వస్తే లక్ష్యంగా తీసుకున్న సంఖ్య పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు అంటున్నారు.

లక్ష్యం దిశగా చర్యలు

పిఎం సూర్యఘర్ పథకానికి జిల్లాలో ఇప్పటి వరకు 1051 దరఖాస్తులు వచ్చాయి. పథకం ప్రయోజనంపై అవగాహన కల్పించి, ఈ సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తున్నాం. నియోజకవర్గానికి పది వేలు చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. 2026 మార్చికి పూర్తి చేయాల్సి ఉంది. ఒక కిలో వాట్‌కు రూ.30 వేలు, 2 కిలో వాట్లకు రూ.60 వేలు, 3 కిలో వాట్ల విద్యుత్తు ఉత్పత్తికి రూ.78 వేలు సబ్సిడీ అందుతుంది. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.



ఎం. లక్ష్మణరావు, విద్యుత్‌శాఖ ఎస్‌ఇ, విజయనగరం

సిబిఎస్‌ఇలో శతశాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి- శృంగవరపు కోట

మండలంలోని భవాని నగర్ వద్ద గల డాక్టర్ వరలక్ష్మి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు సిబిఎస్‌ఇ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణతను సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ వై.జానకి దేవి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2024/25 విద్యా సంవత్సరానికి గాను సిబిఎస్‌ఇ పదో తరగతి పరీక్షలకు మొత్తం 37 మంది విద్యార్థులు పాల్గొనగా 37 మంది ఉత్తీర్ణులు అయి నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. వీరిలో అంబరీష్ మొహంతో 89శాతం, కె.గుణశేఖర్ 85.2శాతం, ఐ. నికిత 84శాతం, 8 మంది విద్యార్థులు డిస్టింక్షన్‌లోనూ, 18 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణి, 10 మంది విద్యార్థులు ద్వితీయ స్థానాలను సాధించారని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల యాజమాన్యం డాక్టర్ వరలక్ష్మి, కొలపర్తి రాజేంద్రప్రసాద్ పాఠశాల విద్యార్థులను, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారని ఆమె తెలిపారు.

చెరువును తలపిస్తున్న రహదారి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీలో రహదారి చెరువులా మారింది. గత కొన్ని రోజులుగా మురుగు నీరు రహదారి మీద ప్రవహించడంతో స్థానికులు, పాదాచారులు ముక్కుమూసుకొని నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా నగర పంచాయతీ ప్రధాన రహదారి పక్కన ఉన్న కాలువ పూడుకుపోయి మురుగునీరు రహదారి మీద ప్రవహించి వాహనదార్లు, పాదాచార్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. స్థానిక మొయిద జంక్షన్ నుంచి జరజాపుపేట వెళ్ళే రహదారిలో చికెన్ షాపు ఎదురుగా కల్వర్టు పూడుకుపోవడంతో మురుగు నీరు రోడ్డు మీద నిలిచి పోతుంది. దీనిపై స్థానికులు పలుమార్లు అధికార్ల దృష్టికి తీసుకువెళ్ళినా రహదార్లు, భవనాల శాఖ చేయాలని చెబుతున్నారు తప్ప సమస్య పరిష్కరించడం లేదని స్థానికులు వాపోతున్నారు. దీంతో బాటు నగర పంచాయతీలో పూర్వ కాలం నాటి సీసీ రోడ్లు, కాలువలు శిథిలావస్థకు చేరి స్థానికులు నడవలేని పరిస్థితి ఉంది. కాగా వర్షాలు కురిసినపుడు మురుగు నీరు రహదారి మీదకు వచ్చేది కానీ ప్రస్తుతం ఎటువంటి వర్షాలు లేకపోయినా కల్వర్టు కింద పూడిక తీయకపోవడంతో మురుగు నీరు రహదారి మీదకు వచ్చిందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు నీరు సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



మొయిద జంక్షన్ సమీపంలో చికెన్ షాపు ఎదురుగా రోడ్డు పై ప్రవహిస్తున్న మురుగునీరు

వడదెబ్బపై అవగాహన

ప్రజాశక్తి - కొత్తవలస

వియ్యంపేట పిహెచ్‌సి పరిధిలో గల తుమ్మికాపల్లి పంచాయతీలోని సీతంపేటలో ఉపాధి హామీ వేతనదారులకు వైద్యాధికారి డాక్టర్ గోపాలకృష్ణ ఆదేశాలు మేరకు పిహెచ్‌సి సిబ్బంది గురువారం వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. డీహైడ్రేషన్ రాకుండా మజ్జిగ, నిమ్మరసం, బార్లీ, కొబ్బరి నీళ్ల, ఓఆర్ఎస్ ద్రావణం వంటి ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఎండలో పనిచేస్తున్నపుడు కాళ్ళకి చెప్పులు, తలకి టోపీ గాని, తలపాగా గాని వేసుకోవాలన్నారు. ఉదయం 10 గంటలు తర్వాత సాయంత్రం 4 గంటలు లోపు బైటకి రావొద్దని సూచించారు. ఎండలో పనిచేస్తున్నపుడు మద్యం, పొగాకు, ఖైనీ వంటివి సేవించరాదని తెలిపారు. బీపీ, షుగర్ ఉన్నవాళ్లు రోజు తప్పకుండా మందులు వేసుకోవాలన్నారు. ఆయిల్ ఫుడ్స్, బిర్యానీ మాంసం వంటి పదార్థాలు తినరాదన్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, గర్భిణులు, బాలింతలు, వృద్ధులు వడ దెబ్బకి గురి కాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం ఓఆర్ఎస్ పాకెట్స్, తల నొప్పి, జ్వరం, వాంతులు, విరోచనాలకి ఫస్ట్ ఎయిడ్ కిట్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎస్ ఈశ్వరరావు, హెల్త్‌అసిస్టెంట్ సత్యారావు, ఆప్తాలమిక్ ఆఫీసర్ ఈశ్వరరావు, ఏఎన్ఎమ్. జ్యోతి, ఆశ వర్కర్ విజయలక్ష్మి, దత్తి లక్ష్మి, 104 సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

గ్రామాల్లో 'వేడిని ఓడించండి'

ప్రజాశక్తి - వేపాడ

ప్రతి నెలా మూడో శనివారం నిర్వహిస్తున్న స్వర్ణంధ్రా, స్వచ్ఛంధ్రా కార్యక్రమంలో భాగంగా ఈ సారి గ్రామాల్లో వేడిని ఓడించండి కార్యక్రమాన్ని చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ, ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ప్రతి సచివాలయంలోనూ తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఆదాయ గృహాల పైకప్పులపై సోలార్ రిఫ్లెక్టివ్ వైట్ పెయింట్‌ను ప్రోత్సహించడం ద్వారా ఇండోర్ ఉష్ణోగ్రతలను తగ్గించవచ్చునన్నారు. ప్రజా ప్రదేశాల్లో తాగునీటి చలివేంద్రాలు, మట్టి కుండ స్టేషన్ ఏర్పాటు చేయడం, నీడనిచ్చే జాతులకు ప్రోత్సాహం ఇస్తూ, పాఠశాల ప్రాంగణాల బహిరంగ ప్రదేశాల్లో చెట్లు నాటడం వంటివి ప్రోత్సహించాలన్నారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి రవికుమార్, మండల వ్యవసాయ అధికారి యశ్వంత్ కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ దేవి, పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎం.వేణు, పశువైద్యాధికారి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి, ఎంపిడిఒ

ఉపాధి కార్మికులకు అన్యాయం

ప్రజాశక్తి - కొత్తవలస

కేంద్రంలో మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం పేద ప్రజలకు, ఉపాధి హామీ కార్మికులకు తీరని అన్యాయం చేస్తున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాడి అప్పారావు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం కొత్త సుంకరపాలెం చెరువులో సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దెల రమణతో కలిసి ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. మే 20వ తేదీన జరగబోయే జాతీయ సార్వత్రిక సమ్మెలో ఉపాధి హామీ కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో ఉన్న నిబంధనలకు తూట్లు పొడుస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లో 40 శాతందారి మళ్లించి ఉపాధి కూలీలకు పొట్టకొడుతున్నాయని చెప్పారు. ఈ దుర్మార్గపు విధానాలను తిప్పుకొట్టేందుకు మే 20వ తేదీన జరిగే సమ్మెలో ఉపాధి హామీ కార్మిలకు మేట్‌లు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి.నూక రత్నం, బి. లీల, పి.అశ్వని, పి.అనూష తదితరులు పాల్గొన్నారు.

లచ్చంపేట సర్పంచ్‌పై దాడి

కేసు నమోదు

ప్రజాశక్తి- లక్కవరపుకోట

మండలంలోని లచ్చంపేట గ్రామ సర్పంచ్ భూమిరెడ్డి ఎర్రయమ్మపై అదే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు దాడి చేసినట్లు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ నవీన్ పడాల గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన కళ్ళెంపూడి రాములమ్మ, జగదీష్, రామ నాయుడు, తోట నాయుడులపై కేసు నమోదు చేశామన్నారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ప్రకారం.. లచ్చంపేటకు చెందిన వేరే వర్గం వారికి భూ వివాదం ఉంది. దీంతో వారు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక జిల్లా కేంద్రంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఫలితంగా రెవెన్యూ అధికారులు విచారణకు వచ్చారు. దీంతో సర్పంచ్ కుమారుడు, మాజీ ఎంపిటిసి భూమిరెడ్డి సతీష్ కలుగుచేసుకుని వివాదాన్ని పరిష్కరించారు. ఈ పరిష్కారం విషయం కళ్లెంపూడి రాములమ్మ, జగదీష్, రామనాయుడు, తోట నాయుడులకు మింగుడు పడలేదు. దీంతో ఈ నెల 14న మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో సర్పంచ్ ఎర్రయమ్మపై పై నలుగురు దాడి చేసి దుర్భాషలాడారు. దీంతో మనస్థాపానికి గురైన సర్పంచ్ భర్త నాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారి నలుగురుపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

రూ.2లక్షల పరిహారం అందజేత

ప్రజాశక్తి - రామభద్రపురం

సహజ మరణ బీమా పథకంలో చేరి ఆకస్మికంగా మృతి చెందిన తారాపురం గ్రామానికి చెందిన పొట్టంగి లక్ష్మి వారసులు పొట్టంగి భాస్కరరావుకు స్థానిక ఎస్‌బిఐ బ్రాంచ్ ఆవరణలో మేనేజర్ బెలగాం హరీంద్ర రూ.2లక్షల బీమా పరిహారాన్ని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా హరీంద్ర మాట్లాడుతూ పిఎం జీవన జ్యోతి బీమా పథకంలో కేవలం 436 చెల్లించి బీమా పాలసీ తీసుకున్న లక్ష్మి ఈ ఏడాది మార్చిలో మరణించగా వారి వారసులు క్లెయిమ్ కోసం దరఖాస్తు చేశారని, పాలసీ నిబంధనలు పరిశీలించి సిఫార్సు చేయడంతో బీమా కంపెనీ విడుదల చేసిన పరిష్కార మొత్తాన్ని చెక్కు రూపంలో అందజేస్తున్నామన్నారు. ఎస్‌బిఐలో ఖాతా ఉన్న ప్రతి ఒక్కరూ జీవనజ్యోతి, సురక్షా బీమా యోజన పథకాల్లో చేరాలన్నారు. ఈ రెండు పథకాలకు సంవత్సరానికి కేవలం రూ.456 మాత్రమే అవుతుందన్నారు. సహజ మరణానికి 2లక్షలు, ప్రమాద మరణానికి 4 లక్షలు వస్తాయన్నారు. వ్యక్తిగత బీమా పథకంలో ప్రమాద బీమా కోసం 2వేలు చెల్లిస్తే రూ.40 లక్షలు వారసులకు అందిస్తారన్నారు. తమ బ్రాంచ్, సమీప ఖాతాదారుల సేవా కేంద్రాల్లో బీమా చేసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో తారాపురం సర్పంచ్ ప్రతినిధి సీతారాం, ప్రసాద్, బ్యాంకు సిబ్బంది, స్థానిక సిఎస్‌పి పివి సత్యారావు పాల్గొన్నారు.



చెక్కును అందిస్తున్న మేనేజర్ హరీంద్ర

ఫ్యాన్సీ బేంగిల్స్ స్టోర్ ప్రారంభం

ప్రజాశక్తి - కొత్తవలస

మండలం లోని కంటకాపల్లి గ్రామం కొత్తూరు గొప్పు వద్ద చిన్ను శారీస్ అండ్ ఫ్యాన్సీ బ్యాంగిల్స్ స్టోర్స్‌ను ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, టిడిపి రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి కోళ్ల అప్పల బాలాజీ రాంప్రసాద్ దంపతులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి మాట్లాడుతూ ప్రొప్రైటర్ రాంజీ దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఇలాంటి వ్యాపారాలు మరెన్నో చేసి ఆర్థికంగా ముందుకు ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గొంప ఉమేష్, కోళ్ల శ్రీను, పొట్నూరు వెంకట రత్నాజీ, చింతలపాలెం సర్పంచ్ మాకేన సీతారామ పాత్రుడు, కంటకాపల్లి సర్పంచ్ మదీనా అప్పలరమణ తదితర నాయకులు, వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.



బ్యాంగిల్ స్టోర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

వేధింపుల నుంచి రక్షించండి

ప్రజాశక్తి - బొబ్బిలి

ట్రాన్స్‌కో ఎఇ, ఎడిఇ వేధింపులు నుంచి తమను రక్షించాలని ప్రభుత్వ ఐటిఐ పక్కనున్న 132/33 కెవి సబ్ స్టేషన్ షిఫ్ట్ ఆపరేటర్లు వేడుకుంటున్నారు. సబ్ స్టేషన్ వద్ద గురువారం షిఫ్ట్ ఆపరేటర్లు ఎం.సత్యనారాయణ, జి.రమేష్ మాట్లాడుతూ ట్రాన్స్‌కో ఎఇ, ఎడిఇ తమకు విశ్రాంతి లేకుండా నిత్యం పని చెప్తున్నారని, భోజనం సమయంలో కూడా పనులు చెపుతూ వేధింపులు చేస్తున్నారని ఆరోపించారు. వేధింపులకు విసుగు చెంది తాము ఉద్యోగం మానివేస్తే అమ్ముకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. వేధింపులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేధింపులు నుంచి రక్షణ కల్పించకపోతే ఆత్మహత్యలు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి వేధింపులు నుంచి రక్షణ కల్పించాలని షిఫ్ట్ ఆపరేటర్లు కోరుతున్నారు.



మాట్లాడుతున్న షిఫ్ట్ ఆపరేటర్లు

జెఎన్‌టియు విద్యార్థికి డాక్టరేట్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియు గురజాడ విశాఖపట్నంకు చెందిన కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థి డాక్టర్. భాను మహేష్ ధూపం డాక్టరేట్ (పిహెచ్‌డి) పట్టాను అందుకున్నారు. 'ఏ ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఆప్టిమైజ్డ్ మెడికల్ ఇమేజ్ రిట్రీవల్ అండ్ క్లాసిఫికేషన్ సిస్టమ్ యూసింగ్ డీప్ లెర్నింగ్' అనే అంశంపై ఆయన నిర్వహించిన పరిశోధన వైద్య రంగంలో కంప్యూటర్-ఎయిడెడ్ డయాగ్నోసిస్ వ్యవస్థలోని మెడికల్ ఇమేజ్ రిట్రీవల్ అండ్ క్లాసిఫికేషన్ సామర్థ్యాన్ని మెరుగుపరచడంపై దృష్టి కేంద్రీకరించారు. ఆయన పరిశోధన ద్వారా డాక్టర్లకు, రేడియోలాజిస్టులకు త్వరితగతిన వైద్య చిత్రాల విశ్లేషణలో అసాధారణతలను గుర్తించడంలో ఉపయోగపడుతుంది.దీంతో వారు క్లినికల్ నిర్ణయాలు తీసుకోవడంలో మరింత నమ్మదగిన మద్దతు పొందుతారు. ప్రస్తుతం, డాక్టర్ భాను మహేష్ కేశవ్ మెమోరియల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఆటోనామస్), నారాయణగూడ, హైదరాబాద్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా, విశ్వవిద్యాలయ అధికారులు, కంప్యూటర్ సైన్స్ విభాగ అధ్యాపకులు, సహ పరిశోధకులు డాక్టర్ భాను మహేష్‌కు అభినందనలు తెలిపారు.



వృద్ధుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-రామభద్రపురం

మండల కేంద్రానికి చెందిన చింతల రామినాయుడు(80) పురుగుల మందు తాగి గురువారం మృతి చెందినట్లు ఎస్‌ఐ ప్రసాదరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు ఈనెల 7న కడుపునొప్పికి తట్టుకోలేక రామినాయుడు పొలంలో పురుగుమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాడంగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

హెచ్‌పిసిఎల్ పైపులైన్‌కు భూములివ్వం

ప్రజాశక్తి- బొబ్బిలి

హెచ్‌పిసిఎల్ పైపులైన్‌కు తమ భూములను ఇవ్వమని రైతులు తెగేసి చెప్పారు. గురువారం రైతు సంఘం ఆధ్వర్యంలో చింతాడ, రాముడువలస, శివడవలస, కొండదేవుపల్లి, కమ్మవలస, పిరిడి గ్రామాల్లో విశాఖపట్నం నుండి రాయపూర్ వరకు హెచ్‌పిసిఎల్ పైపులైను వల్ల భూములు నష్టపోయిన రైతులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి గోపాల్ మాట్లాడుతూ బాడంగి, బొబ్బిలి మండలాల్లో సుమారు 15 గ్రామాలు మీదుగా హెచ్‌పిసిఎల్ పైపులైను వేస్తున్నట్లు ఆ గ్రామాల రైతులకు నోటీసులు ఇచ్చారని అన్నారు. రైతుల భూములు పోకుండా ప్రత్యామ్నాయంగా విశాఖ నుండి రాయపూర్ వెళ్లే గ్రీన్ ఫీల్డ్ హైవే పక్కగుండా హెచ్‌పిసిఎల్ వారు పైప్‌లైన్ వేసుకోవచ్చునని, అలా కాకుండా పచ్చని పొలాలు మధ్య పైపులైను వేయడం సరైనది కాదని అన్నారు. బాడంగిలో ఇప్పటికే ఆయుధ డిపో పేరుతో వందల ఎకరాలు తీసుకుంటున్న కేంద్ర ప్రభుత్వం మరల హెచ్‌పిసిఎల్ పైపులైన్ పేరుతో 18 మీటర్ల వెడల్పుతో భూమిని తీసుకోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. భూములు, తోటలు నష్టపోయిన రైతులకు అరకొర నష్టపరిహారం చెల్లించి భూములు తోటలు తీసుకోవడానికి చూస్తున్నారని దీనిని రైతులందరూ తీవ్రంగా వ్యతిరేకించాలని అన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకర్రావు మాట్లాడుతూ ఈ నెల 16న శుక్రవారం ఉదయం 10 గంటలకు విజయనగరం కలెక్టర్ ఆఫీస్ వద్ద జరిగే ధర్నాలో తమ అభ్యంతరాన్ని తెలియజేయడానికి రైతులందరూ కదలాలని విజ్ఞప్తి చేశారు. కరపత్రం పంపిణీ కార్యక్రమంలో కమ్మ వలస రైతులు పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని పాల్తేరు, మల్లంపేట, పూడివలస, పిన్నవలస, కోడూరు గ్రామాల్లో పైపులైన్ వల్ల నష్టపోయిన రైతులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి ఎ.సురేష్ మాట్లాడుతూ మండలంలో సుమారు 7 గ్రామాలు మీదుగా ఈ పైపులైను వేస్తున్నట్లు ఆ గ్రామాల రైతులకు నోటీసులు ఇచ్చారని అన్నారు. దీన్ని రైతులంతా ముక్త కంఠంతో వ్యతిరేకించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



కరపత్రాలను ప్రదర్శిస్తున్న నాయకులు, రైతులు